సాక్షి
విశాఖపట్నం
మంగళవారం : 2 : ఏప్రిల్ : 2024



అంతా నృసింహమయం
నృసింహస్వామి నామస్మరణతో సోమవారం సింహగిరి హోరెత్తింది. వేద మంత్రోచ్ఛరణలతో ప్రజ్వరిల్లింది. 8లో



తిరుపతికి హార్ట్, లంగ్స్ తరలింపు
బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి హార్ట్, లంగ్స్ తిరుపతికి షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి నుంచి తరలించారు. 8లో



డీసీ, కేకేఆర్ జట్ల ప్రాక్టీస్ 8లో

పండుటాకుల పై రాజకీయాలా?



- ఐదేళ్లుగా ఒకటో తేదీనే చేతికి పింఛన్
- తెల్లారేసరికే ఇంటి తలుపు తట్టిన వలంటీర్లు
- వచ్చమూక కుట్రతో పింఛన్ల పంపిణీకి బ్రేక్
- చంద్రబాబుకు తమ ఉసురు తగులుతుందని శాపనార్థాలు
- పింఛన్ కోసం మండుటెండలో సచివాలయాలకు వెళ్లలేమంటున్న వృద్ధులు
- కూటమి అధికారంలోకి వస్తే తిప్పలు తప్పవని ఆందోళన
- జగన్‌నే గెలిపించుకుంటామని ఉద్ఘాటన

సాక్షి, విశాఖపట్నం: సోమవారం వేకువజామున అవ్వా, తాతా అనే పిలుపు వినబడలేదు. సూర్యోదయానికి ముందే తలుపు తట్టిన శబ్దం రాలేదు. పొద్దెక్కుతున్నా ఆప్యాయంగా పలకరించే వలంటీర్ జాడ కనిపించలేదు. దీంతో ఈ రోజు ఒకటో తారీఖేనా? అంటూ ఒకటికి రెండుసార్లు సందేహ నివృత్తి చేసుకున్నారు. ఔనని నిర్ధారించుకున్న తరువాత.. మరి తెల్లారకుండానే పింఛన్ సొమ్ము చేతిలో పెట్టే వలంటీరు ఎందుకు రాలేదు? అంటూ ఇరుగు పొరుగు వారిని ఆత్రంగా ఆరా తీశారు. 'చంద్రబాబు బ్యాచ్ వలంటీర్లు పింఛన్లు ఇవ్వకుండా అడ్డుపడ్డారంట.. ఆ బాబు పాలనలో మాదిరిగానే ఊళ్లో సచివాలయాలకెళ్లి పింఛన్ డబ్బు తీసుకోవాలంట.. ఇంటికి తెచ్చి ఇవ్వరంట.. అని చావు కబురు చల్లగా చెప్పగా పడుతూ లేస్తూ జీవనం సాగించే పండుటాకులు మండిపడుతున్నారు. మండుటెండల్లో సచివాలయానికి వెళ్లడం ఎలా? అంటూ ఆవేదన చెందుతున్నారు. వయసు మీరి కాళ్లు కదపలేని వారు.. ఆరోగ్య సమస్యలు చుట్టుముట్టిన వారు.. ఏ ఆసరా లేని వారు.. మంచాన పడి కదల లేనివారు.. దివ్యాంగులు.. ఇలా ఎందరో పేద ముదుసలులు తమ పరిస్థితి ఏమిటంటూ ఉసూరుమంటున్నారు. చంద్రబాబుకు తమ ఉసురు తగులుతుందని శాపనార్థాలు పెడుతున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పింఛన్ సొమ్మును వలంటీర్లు ప్రతి నెలా ఒకటో తారీఖునే ఇంటికి తెచ్చి ఇస్తున్నారని..


పింఛన్ కోసం వేచి చూస్తున్న రాములు, బంగారమ్మ

కూటమి అధికారంలోకి వస్తే మునుపటిలా తమకు తిప్పలు తప్పవని భయాందోళన చెందుతున్నారు. అందుకే ఈ ఎన్నికల్లో మళ్లీ జగన్‌నే సీఎంగా గెలిపించుకుంటామని నెలనెలా ఠంఛనుగా పింఛన్ అందుకుంటున్న వారు ఉద్ఘాటిస్తున్నారు.

ఐదేళ్ల క్రితం పెన్షన్ రూ.వెయ్యే..

చంద్రబాబు హయాంలో అర్హులందరికీ కాకుండా ఏ కొద్దిమందికో పింఛన్ అందేది. అదీ అరకొరగానే. 2019 జనవరి వరకు నెలకు రూ.వెయ్యి మాత్రమే ఇచ్చేవారు. ఈ సొమ్ము కోసం పంచాయతీ కార్యాలయాల చుట్టూ పలుమార్లు తిరగాల్సి వచ్చేది. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని రూ.2 వేలకు పెంచుతున్నట్టు ప్రకటించారు. వైఎస్ జగన్ హామీ మేరకు అధికారంలోకి వచ్చాక పింఛన్ సొమ్మును రూ.2,250 నుంచి నాలుగేళ్లలో రూ.3 వేలకు పెంచుతూ వచ్చారు. అదీ ఇంటికే తెచ్చి ఇచ్చే వ్యవస్థను తెచ్చారు. టీడీపీ హయాంలో ఉమ్మడి విశాఖలో (2019 ఎన్నికల ముందు వరకు) ప్రతి నెలా 4,22,335 మందికి రూ.75.83 కోట్లు చెల్లించేవారు. వైఎస్సార్‌సీపీ పాలనలో పింఛన్లు 5,61,336కి పెంచారు. నెలనెలా రూ.166.82 కోట్లు పంపిణీ చేస్తున్నారు.

41 మంది వలంటీర్ల రాజీనామా

పేదలకు సేవ చేయలేని కొలువు తమకు వద్దంటూ పెందుర్తి మండలం గొరపల్లిలో 18 మంది, పరవాడ మండలం తానాం పంచాయతీలో 23 మంది వలంటీర్లు రాజీనామా చేశారు.

టీడీపీ పాలనలో ఉమ్మడి విశాఖలో పింఛన్లు

అర్బన్ ప్రాంతంలో	1,16,789
గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతంలో	3,05,546
మొత్తం పింఛన్లు	4,22,335
ప్రతినెలా చెల్లించిన మొత్తం	రూ.75.83 కోట్లు

2019 తర్వాత వైఎస్సార్‌సీపీ హయాంలో

ఉమ్మడి విశాఖలో మొత్తం పింఛన్లు	5,61,336
ప్రతి నెలా అందిస్తున్న మొత్తం	రూ.166.82 కోట్లు
విశాఖ జిల్లాలో మొత్తం పెన్షన్లు	1,65,891
ప్రతి నెలా అందిస్తున్న సొమ్ము	రూ.50.11 కోట్లు
అనకాపల్లి జిల్లాలో మొత్తం పింఛన్లు	2,67,097
ప్రతి నెలా అందిస్తున్న మొత్తం	రూ.77.78 కోట్లు
అల్లూరి జిల్లాల్లో మొత్తం పింఛన్లు	1,28,348
ప్రతి నెలా అందిస్తున్న మొత్తం	రూ.38.93 కోట్లు

ఉదయాన్నే పెన్షన్ అందించేవారు



నాకు వితంతు పెన్షన్ రూ.3 వేలు ప్రతి నెల ఒకటో తేదీన ఉదయమే వలంటీర్లు ఇంటికి వచ్చి ఇచ్చేవారు. ఎన్నికల కారణంగా వలంటీర్లను బాధ్యతల నుంచి తప్పించారంటున్నారు. పెన్షన్ కోసం సచివాలయానికి వెళ్లమంటున్నారు. ఇక మాకు అవస్థలే.

– వి.రమణమ్మ, తగరపువలస

5 కి.మీ. వెళ్లాలా..



నాకు 82 ఏళ్లు. నడుం దెబ్బతినడంతో ఇంటికే పరిమితమయ్యాను. జగన్ బాబు వచ్చిన తర్వాత ప్రతి నెలా ఒకటో తేదీనే వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చేవాడు. ఈ నెల పింఛన్ అందుతుందని ఎదురు చూసినా వలంటీర్ జాడ కనిపించలేదు. మా గ్రామం నుంచి బంగారమ్మపాలెంలో ఉన్న గ్రామ సచివాలయం 5 కిలో మీటర్ల దూరంలో ఉంది. అంతదూరం వెళ్లి పింఛన్ తెచ్చుకునే పరిస్థితి నాకు లేదు.

– వాయిబోయిన సన్యాసమ్మ, రాయపుర అగ్రహారం, సబ్బవరం


మళ్లీ ఎదురుచూపులే.. నాగరత్నం, పూలమ్మ ఆవేదన

వారి సేవలు వెలకట్టలేనివి



వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి. ఒకటో తేదీన ఉదయం తలుపు తట్టి పెన్షన్లు అందించేవారు. కరోనా కాలంలో అవసరమైనవారికి మందులు తెచ్చి ఇచ్చేవారు. ప్రభుత్వం తరఫున ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులు అందించారు. ఇన్ని సేవలు అందించిన వారిని ఎన్నికల పేరుతో దూరం చేయడం తగదు.

– కొప్పల సత్యనారాయణ, తగరపువలస

మా తలరాత మళ్లీ మొదటికి..



వలంటీర్లు ప్రభుత్వానికి సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు అందించేవారు. వారి అందించే సేవలను దూరం చేస్తే మా తలరాత మళ్లీ మొదటికి వస్తుంది. ఇటీవల ఇంటి వద్దకే రిజిస్ట్రేషన్ చేసిన ఇంటి పట్టాను అందించారు. కేవలం పెన్షన్లు, రేషన్ మాత్రమే కాకుండా ప్రభుత్వం తరఫున ఆస్తిపన్ను, చెత్త పన్ను, కుళాయి పన్నులు వసూలు చేసేవారు. మెడికల్ క్యాంపుల వివరాలు తెలియజేశారు.

– షేక్ పెంటా సాహెబ్, శ్రీనగర్, తగరపువలస

మాకు పింఛన్ ఇచ్చేదెవరు?



తోడు ఎవరొస్తారు.. నేను అంధుడిని. ప్రతీ నెలా మా వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి పింఛన్ అందించేవారు. ఇప్పుడు వలంటీర్లు ఇవ్వరు అంటున్నారు. మాకు పింఛన్ అందించేది ఎవరు? గతంలో లాగా మళ్లీ మేము ఇబ్బందులు పడాలా? పింఛన్ కోసం ఎవరో ఒకరిని తోడు తీసుకుని వెళ్లాలి. వారి సమయం వృథా చేయాలి. ఏమి అర్థం కావడం లేదు. వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీని అడ్డుకోవడం తగదు.

– గుంటిపల్లి సత్యనారాయణ, లక్ష్మీనారాయణపురం–2

మూల్యం చెల్లించుకుంటారు..



పింఛన్ పంపిణీలో వలంటీర్లను వారించి టీడీపీ సాధించేది ఏంటి. వృద్ధులు, వికలాంగులను ఇబ్బందులకు గురిచేయడం తప్ప. వలంటీర్లు పింఛన్ పంపిణీకి వచ్చి ఫలానా పార్టీకి ఓటేయాలని చెప్పినంత మాత్రాన ఓటేయరు. ప్రభుత్వం మంచి చేసిందని భావిస్తే ఆ పార్టీకే ఓటేస్తారు. మాలాంటి పింఛన్‌దారులను ఇబ్బంది పెట్టి మాలో కసిని పెంచారు. ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకుంటారు.

–బంటు దేముడమ్మ, అగనంపూడి కాలనీ

ఎందుకు అడ్డుకుంటున్నారో..



బుచ్చిరాజుపాలెంలో కుటుంబంతో ఉంటున్నాను. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక నాకు పింఛను వచ్చింది. ప్రతి నెలా ఒకటో తేదీనే వలంటీర్ వచ్చి పింఛన్ అందజేసేది. ఎన్నికలను ఎవరో ఫిర్యాదు చేశారట. ఇప్పుడు వలంటీర్లు వచ్చి పింఛను ఇవ్వరని తెలిసింది. ఇప్పుడు ఎక్కడకు వెళ్లాలో తెలియడం లేదు. వలంటీర్లను ఎందుకు అడ్డుకున్నారో..ఆళ్లకేమొచ్చిందో..ఈ వయసులో మమ్మల్ని ఎందుకు ఇబ్బంది పెడుతున్నారో అర్థం కావడం లేదు.

–వాసా కన్నమహాలక్ష్మి, చిన్నబుచ్చిరాజుపాలెం

వృద్ధులకు ఇబ్బంది తప్పదు



పింఛను డబ్బులు కోసం మళ్లీ ఆఫీసుకు వెళ్లాలట. ఈ ఐదేళ్లలో ఒకటో తేదీనే ఇంటి తలపుతట్టి మరీ వలంటీర్లు పెన్షన్ అందించారు. ఎన్నికలు అని వలంటీర్ల చేత పింఛన్లు ఇవ్వొద్దని చంద్రబాబు నాయుడు ఫిర్యాదు చేశాడట. వృద్ధులకు ఎందుకు ఇబ్బందులు పెట్టడం. ఇప్పుడు సచివాలయానికి వెళ్లి తీసుకోవాలని అంటున్నారు. ఎండలో నిలబడాలి. ఎప్పుడిస్తారో..ఎన్ని గంటలు పడుతుందో.

– పకీరు నాయుడు, వృద్ధుడు, సంతపాలెం, ఆరిలోవ

చాలా సేపు ఎదురు చూశా



ప్రతి నెలా ఒకటో తేదీనే వలంటీర్ మా ఇంటికొచ్చి పింఛను ఇచ్చేవాడు. ఆ డబ్బులతోనే ఖర్చులు తీరుతున్నాయి. మధ్యాహ్నం వరకు వలంటీరు కోసం ఎదురుచూశా..ఎలక్షన్ వల్ల వలంటీరు రాడని ఇప్పుడే వీధిలో వాళ్లు చెప్పారు. వలంటీర్లతో పింఛన్లు ఇవ్వద్దని ఫిర్యాదు చేశాడట..ఇప్పుడు ఎక్కడికి వెళ్లాలో, ఎప్పుడు డబ్బులు ఇస్తారో అయోమయంగా ఉంది.

–గట్టా దేవి, వృద్ధురాలు, ఆరిలోవ

వారి సేవలు మరువలేం



గత టీడీపీ ప్రభుత్వంలో రోజుల తరబడి క్యూలో నిలబడి పింఛను తీసుకునే వాళ్లం. ఒక్కోసారి ఎండలకు సొమ్మసిల్లేవాళ్లం. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. ఒకటో తేదీనే ఇంటి తలుపు తట్టి వలంటీర్లు పెన్షన్ అందజేస్తున్నారు. మళ్లీ జగన్‌బాబు ప్రభుత్వమే రావాలి, వలంటీర్ వ్యవస్థ కొనసాగించాలి.

– చింతల ముత్యాలమ్మ, మిరపకాయలవీధి, అల్లిపురం

వృద్ధులకు ఉపయోగం



మాలాంటి వృద్ధులకు వలంటీర్ వ్యవస్థ ఎంతో ఉపయోగం. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన వలంటీర్ వ్యవస్థ చాలా గొప్పది. వారి సేవలను కొనసాగించాలి. కోవిడ్ సమయంలో వారు ప్రాణాలకు తెగించి సేవలందించారు. టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలతో పడిన ఇబ్బందులు చాలా చూశాం.. జగన్ ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలి.

– బాల మోహన్‌రావు, కుమ్మరవీధి, అల్లిపురం

ప్రాణాలకు తెగించి..



కోవిడ్ సమయంలో ప్రత్యక్ష దైవంగా వలంటీర్లను చూశాం. ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలందించారు. కరోనా సమయంలో మాకు ఊపిరి పోసింది వాళ్లే. ఈ రోజు మేము ఇలా ఉన్నామంటే వారే కారణం. పింఛన్లు ఒకటో తేదీ ఉదయాన్నే అందించేవాళ్లు. రేషన్ ఇంటికి అందజేస్తున్నారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే సీఎంగా రావాలి. వలంటీర్ల సేవలు కొనసాగించాలి.

– కాకి కనకమహాలక్ష్మి, బంగారమ్మమెట్ట, అల్లిపురం

ఇబ్బంది పెడతారా...



నేను దివ్యాంగుడ్ని. ఎటూ కదలలేను. ప్రతి నెల ఒకటో తేదీనే ఇంటికి వచ్చి వలంటీర్ పెన్షన్ డబ్బులు ఇచ్చేవాడు. ప్రతిపక్ష పార్టీలు కుట్రతో వలంటీర్లు పెన్షన్ ఇవ్వకుండా అడ్డుకుంటున్నారు. పాత రోజులు గుర్తు వస్తున్నాయి. అప్పట్లో వార్డు కార్యాలయం వద్ద పడిగాపులు కాసేవాడిని. మా లాంటి వారిని ఇబ్బందిపెట్టే రాజకీయాలు మంచివికాదు. ఇలా చేసినవారికి ఓటుతోనే బుద్ధి చెబుతాం.

– షేక్ కాజా, 44వ వార్డు, ఎంటీసీపాలెం

దేవుడు క్షమించడు



నాకు 80 ఏళ్లు. ఈ వయస్సులో పెన్షన్ కోసం ఎక్కడకని తిరగాలి. ఎప్పుడు ఇస్తారు, ఎక్కడ ఇస్తారో తెలియదు. జగన్‌బాబు వచ్చిననాటి నుంచి వలంటీర్ మా ఇంటికి వచ్చి పెన్షన్ డబ్బులు ఇచ్చేవాడు. చంద్రబాబుకు మా లాంటి ముసలోళ్ల పట్ల మానవత్వం లేదా. ఈ వయస్సులో పెన్షన్ కోసం తిప్పుతారా. దేవుడు కూడా క్షమించడు.

– సిహెచ్.అప్పయ్యమ్మ, సీతంపేట

ఈ ఐదేళ్లు ఇంటి వద్దే పెన్షన్ తీసుకున్నా..



ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటికి వచ్చి వలంటీరు పింఛను డబ్బులు ఇచ్చేవాడు. తెల్లవారే సరికి బాగున్నారా, ఆరోగ్యం బాగుందా అంటూ పలకరించి మరీ డబ్బులు చేతికిచ్చేవాడు. ఇప్పుడు సచివాలయానికి వెళ్లి డబ్బులు తీసుకోవాలట. గత ప్రభుత్వంలో మాదిరి రోజంతా అక్కడ కాపలా కాయాలేమో. జగన్ వచ్చినప్పటి నుంచి ఎక్కడికీ వెళ్లకుండా ఇంటి వద్దే పెన్షన్ అందుకున్నాం.

– బొండా వరలక్ష్మి, ఆరిలోవ

గంటా.. ఏ ముఖం పెట్టుకొని మళ్లీ పోటీ చేస్తున్నావ్?

- 2014లో భీమిలిలో గెలిచి నియోజకవర్గానికి ఏమిచేశావు
- కరోనా సమయంలో ఇక్కడ ప్రజలకు కనిపించావా..
- వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి సూటిప్రశ్న

పద్మనాభం: ఏ ముఖం పెట్టుకొని గంటా శ్రీనివాసరావు భీమిలిలో మళ్లీ పోటీ చేయడానికి సిద్ధపడ్డాడో ప్రజలే అతన్ని నిలదీయాలని వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి సూచించారు. పద్మనాభం మండలంలోని రెడ్డిపల్లిలో సోమవారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014 ఎన్నికల్లో భీమిలి నుంచి గెలిచిన గంటా శ్రీనివాసరావు నియోజకవర్గాన్ని, ఇక్కడ ప్రజలను పట్టించుకోలేదన్నారు. తర్వాత వేరే నియోజకవర్గానికి వెళ్లి గెలిచిన ఆయన కరోనా కష్టకాలంలో కూడా ఇక్కడ ప్రజలకు కనిపించలేదన్నారు. ఇప్పుడు మళ్లీ ఏమి ఉద్ధరించడానికి ఇక్కడ పోటీ చేయడానికి సిద్ధపడ్డాడో ప్రజలు ప్రశ్నించాలన్నారు. గంటా మాయ మాటల్లో పడకుండా ఫ్యాన్ గుర్తుకు ఓటేసి విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీ లక్ష్మి, భీమిలి ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ లక్ష్మి మాట్లాడుతూ చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకోవడంతో వలంటీర్ల ద్వారా పింఛన్లు అంజేయకుండా అడ్డుకున్నారన్నారు. అవ్వా, తాతల ఉసురు ఆయనకు తగులుందన్నారు. చంద్రబాబు సీఎం అయితే రాష్ట్రం రావణ కాష్టం అవుతుందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదలకు, పెత్తందారులకు జరుగుతున్న ఈ ఎన్నికల్లో గంటా శ్రీనివాసరావు ఓటమి చూస్తాడన్నారు.


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

క్రెడాయ్ కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం

మద్రిపాలెం: క్రెడాయ్ విశాఖపట్నం నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైంది. సోమవారం జీవీఎంసీ 51వ వార్డు ఆర్ అండ్ బీ సమీపంలోని ఓ హోటల్‌లో కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ మేరకు జరిగిన ఎన్నికల్లో 2024–25 సంవత్సరానికి గాను క్రెడాయ్ విశాఖపట్నం చైర్మన్‌గా కె.ఎస్.ఆర్.కె.రాజు(సాయి) నియమితులయ్యారు. సంస్థ అధ్యక్షుడిగా వి.ధర్మేందర్, ఉపాధ్యక్షులుగా ఈ.అశోక్‌కుమార్, సీహెచ్.గోవిందరాజు, జి.వి జయకుమార్ ఎంపికయ్యారు. సంస్థ గౌరవ కార్యదర్శిగా వి.శ్రీను, జాయింట్ కార్యదర్శులుగా కె.శ్రీనివాస్, పి.నరసింహారావు, జి.కార్తీక్, కోశాధికారిగా కె.వి.ఆర్.రాజు(రమేష్) నియమితులయ్యారు. కమిటీ సభ్యులుగా ఎం.కృష్ణమోహన్‌రావు, జి.రాజేష్, ఎ.శ్రీనివాసరావు, పవన్, ఆర్.ఎస్.కుమార్, ఆర్.కిరణ్‌కుమార్ ఎంపికయ్యారు. రియల్ ఎస్టేట్ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు.



కొత్తగా ఎంపికైన కార్యవర్గం

మీరే మా సైన్యం

- పార్టీ గెలుపునకు అనుబంధ సంఘాల పాత్ర కీలకం
- మంత్రి బొత్స సత్యనారాయణ

ఎంవీపీకాలనీ: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పార్టీ అనుబంధ సంఘాలు పని చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం లాసన్స్ బే కాలనీలోని వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ అనుబంధ సంఘాల జిల్లా ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో అనుబంధ సంఘాల ప్రతినిధుల పాత్ర, విధి విధానాలను బొత్స సత్యనారాయణ వివరించారు. రానున్న తరాలకు మంచి భవిష్యత్ అందించాలని, అభివృద్ధిలో రాష్ట్రాన్ని ముందుకు నడిపించాలని, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు సమానాభివృద్ధి సాధించాలన్న లక్ష్యాలతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ ఐదేళ్ల పాలన సాగిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందించిన సంక్షేమం దేశంలోని ఏ ప్రభుత్వం అందించలేదన్నారు. ఇదే తరహాలో రానున్న రోజుల్లో సంక్షేమం, అభివృద్ధి రాష్ట్రంలో జరగాలంటే అందుకు వైఎస్సార్‌సీపీని గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇందుకు అనుగుణంగా అనుబంధ సంఘాల ప్రతినిధులు వీర సైనికుల్లా పనిచేయాలని సూచించారు. ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న కుట్రలను సోషల్ మీడియా ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించాలన్నారు.ఐదేళ్లలో సీఎం జగన్ చేసిన అభివృద్ధిని ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లి వివరించాలన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఈ రాష్ట్రానికి ఏం చేశారు? ఈ ఐదేళ్ల కాలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమాన్ని ప్రజలకు స్పష్టంగా వివరించాలన్నారు. వైఎస్సార్‌సీపీ మంచి చేస్తేనే ఓటేయండి లేకుంటే వద్దని ధైర్యంగా చెప్పిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఇలాంటి దమ్మున్న ప్రకటన దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయలేదన్నారు. ఈ నేపథ్యంలో అనుబంధ సంఘాలు ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లి వైఎస్సార్‌సీపీకి ఓటు అడగాలన్నారు. కూటమికి ఓటేస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు వ్యతిరేకంగా ఓటేసినట్టేనన్నారు. దోపిడీ, సొంత సామాజికవర్గ అభివృద్ధే చంద్రబాబు ధ్యేయమన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో అఖండ మెజారిటీతో పార్టీని గెలిపించే బాధ్యత అనుబంధ సంఘాలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు మళ్ల విజయప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండా రాజీవ్ గాంధీ, నియోజకవర్గ అదనపు పరిశీలకులు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

పేదలు సంతోషంగా ఉంటే చంద్రబాబు ఓర్వలేడు

- ఎల్లోమీడియాతో కలిసి వలంటీర్ల సేవలపై దుష్ప్రచారం
- ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ధ్వజం



ఎంవీపీకాలనీ: పేదలు సంతోషంగా ఉంటే చంద్రబాబు నాయుడు ఓర్వలేడని ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. పేదలకు పెన్షన్ పంపిణీ చేసే బాధ్యతల నుంచి వలంటీర్లను తప్పించడంలో టీడీపీ, ఆ పార్టీ పెత్తందారుల కుట్రలపై ఆయన ధ్వజమెత్తారు. ఈ మేరకు సోమవారం లాసన్స్ బే కాలనీలోని ఆయన కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లో మీడియాతో కలిసి తెలుగుదేశం, జనసేన పార్టీలు తొలి నుంచి వలంటీర్లపై విషం కక్కుతున్నాయన్నారు. చంద్రబాబు నియమించిన జన్మభూమి కమిటీలు పేదలను దోచుకుంటే జగన్ నియమించిన వలంటీర్లు పేదలందరికీ సంక్షేమాన్ని చేరువ చేశారన్నారు. తాను అధికారంలోకి వస్తే వలంటీర్లను తీసేస్తామంటూ చంద్రబాబు గతంలో చేసిన వ్యాఖ్యలను నిజం చేసే దిశగా వారిపై విషం కక్కుతున్నారన్నారు. టీడీపీకి కొమ్ముకాస్తున్న ఈనాడు రామోజీరావు వలంటీర్లపై విషపురాతలు మానుకోవాలన్నారు. 2,500 ఎకరాల్లో తన ఇంటిని, ఫిలింసిటీని నిర్మించుకున్న ఆయన పేదలకు సెంటు స్థలం ఇస్తే దాన్ని తట్టుకోలేక పోతున్నాడన్నారు.

రేపటి నుంచి పింఛన్ల పంపిణీ

మహారాణిపేట: సామాజిక పింఛన్లు ఈనెల 3వ తేదీ నుంచి పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండడం వల్ల ఏప్రిల్, మే, జూన్ నెలల సామాజిక పింఛన్లు గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వలంటీర్లు వద్ద ఉన్న ఫోన్లు, బయోమెట్రిక్ పరికరాలను పంచాయతీ కార్యదర్శులకు తక్షణం అందజేయాలని కోరారు. వీటిని వెంటనే సంబంధిత ఎంపీడీవో/ జోనల్ కమిషనర్‌లకు అందజేయాలన్నారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగంలో శ్రద్ధ అవసరం

మహారాణిపేట: ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యమయ్యే అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ వినియోగంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగం, వయో వృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల ఓటు హక్కు వినియోగంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన సోమవారం వర్చువల్ విధానంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ఆయన పలు సలహాలు, సూచనలు అందజేశారు. విశాఖ కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ మల్లికార్జున, జేసీ మయూర్ అశోక్, ఎంసీసీ నోడల్ అధికారి సీఎం సాయికాంత్‌వర్మ, ఏడీసీ కె.విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, ఆయా నియోజకవర్గాల ఆర్వోలు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.



ద్విచక్ర వాహనంపై జనసేన పార్టీ స్టిక్కర్



ద్విచక్రవాహనంపై తెలుగుదేశం పార్టీ సింబల్

'కోడ్'..వెహి'కిల్'

దాబాగార్డెన్స్: అన్ని పార్టీలు ఎన్నికల నిబంధనలు కచ్చితంగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మల్లి కార్జున, జిల్లా అధికారులు ఇప్పటికే చాలా సార్లు అవగాహన కల్పించారు. కోడ్ అమల్లోకి వచ్చిన తరువాత ఎన్నికల నియమావళిని పాటించి సహకరించాలని కోరారు. అయితే ఎన్నికల అధికారుల ఆదేశాలను అటు టీడీపీ, ఇటు జనసేన పార్టీలు గాలికొదిలేశాయి. కోడ్‌ను కొండెక్కించేశాయి. ఎంత కట్టుదిట్టంగా అధికారులు విధులు నిర్వహిస్తున్నప్పటికీ ఈ రెండు పార్టీల నేతలు మాత్రం పనికట్టుకుని కోడ్ ఉల్లంఘిస్తున్నారు. కూటమి పార్టీలకు చెందిన అనుచరులు, కార్యకర్తలు కోడ్‌ను పట్టించుకోవడం లేదు. వారి వాహనాలకు పార్టీ స్టిక్కర్లు, గుర్తులతో నగరంలో తిరుగుతున్నారు. ఇటువంటి వాహనాలపై అధికారులు కఠినంగా వ్యవహరించాలని, ఆయా పార్టీల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులకు హెచ్చరికలు జారీ చేయాలని పలువురు కోరుతున్నారు.




కారుపై తెలుగుదేశం పార్టీ స్టిక్కర్

అంతా నృసింహమయం

- సింహగిరిపై వైభవంగా ముగిసిన సుదర్శన నారసింహ మహాయజ్ఞం
- విశేషంగా మహా పూర్ణాహుతి
- పరవశించిన భక్తజనం


మహా పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న స్వరూపానందేంద్ర సరస్వతి స్వాత్మానందేంద్ర సరస్వతి

సింహాచలం: నృసింహస్వామి నామస్మరణతో సోమవారం సింహగిరి హోరెత్తింది. వేద మంత్రోచ్ఛరణలు, దివ్యప్రబంధ పారాయణాలతో ప్రజ్వరిల్లింది. సింహగిరిపై ఏడు రోజులుగా జరిగిన శ్రీ సుదర్శన నారసింహ మహాయజ్ఞం సోమవారంతో ముగిసింది. భక్తులు భక్తిపారవశ్యంలో మునిగితేలారు. పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి ఉదయం 6గంటల నుంచి వైదిక కార్యక్రమాలను దేవస్థానం అర్చకులు నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను, చక్రపెరుమాళ్‌ను యాగశాల్లో వేంజేంపచేసి యజ్ఞాన్ని నిర్వహించారు. అనంతరం ఉదయం 9.13 గంటలకు మహా పూర్ణాహుతి నిర్వహించారు. తదుపరి ధ్వజావరోహణాన్ని నిర్వహించారు. అనంతం యజ్ఞంలో ఉంచిన ప్రధాన కలశని దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు శిరస్సుపై పెట్టుకుని యజ్ఞశాల నుంచి తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అనంతం మళ్లీ యజ్ఞశాలకు ప్రధాన కలశను తీసుకొచ్చారు. ఆ జలాలను స్వామికి సమర్పించారు. అనంతరం భక్తులపై ఆ జలాలను చల్లారు. తదుపరి ఉత్సవమూర్తుల చెంతన రామాయణం, భాగవతం, విష్ణుపురాణం, నృసింహ శతకం, దివ్యప్రబంధ పారాయణం, క్షేత్ర మహత్యం, సుదర్శన శతకం పారాయణాలను వైదికులు పఠించారు. విశాఖ శ్రీ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి, దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు దంపతులు, పూర్వ అనువంశిక ధర్మకర్త దివంగత ఆనందగజపతిరాజు సతీమణి సుధాగజపతిరాజు, దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి దంపతులు, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శిరీష, ట్రస్ట్ బోర్డు సభ్యులు సంపంగి శ్రీనివాసరావు, గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, పెనుమత్స శ్రీదేవి వర్మ పాల్గొన్నారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు, రుత్వికులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా శాంతి కల్యాణం

నృసింహ యజ్ఞం ముగింపులో భాగంగా శాంతి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై వేంజేంపచేశారు. విష్వక్సేణపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. తదుపరి రాష్ట్రవ్యాప్తంగా యజ్ఞంలో పాల్గొనేందుకు వచ్చిన రుత్వికులను, దేవస్థానం అర్చకులను, యజ్ఞానికి సహకరించిన విశిష్ట దాతలను దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి ఘనంగా సత్కరించారు.

నృసింహ యజ్ఞం నిర్వహణ భేష్

లోకకల్యాణం కోసం సింహగిరిపై ఏడు రోజులపాటు సుదర్శన నారసింహ మహాయజ్ఞం నిర్వహించడం చాలా గొప్ప విశేషమని శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి తెలిపారు. మహా పూర్ణాహుతి అనంతరం ఆయన అనుగ్రహభాషణం చేశారు. అన్ని క్షేత్రాల్లో సింహాచలం క్షేత్రం ఎంతో విశిష్టమైనదని, ఇక్కడ ఉన్న ఆచారసంప్రదాయాలు ఎంతో గొప్పవన్నారు. అలాంటి క్షేత్రంలో వైదికపరంగా, సంప్రదాయపరంగా వైదికులు యజ్ఞాన్ని నిర్వహించి పుణ్యఫలం సమాజానికి అందించారన్నారు. ఎంతో సమర్థవంతంగా యజ్ఞం నిర్వహించిన దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తిని అభినందించారు.

విజయమే లక్ష్యంగా డీసీ, కేకేఆర్ జట్ల ప్రాక్టీస్



నెట్ ప్రాక్టీస్‌లో డీసీ, కేకేఆర్ జట్ల క్రీడాకారులు

విశాఖ స్పోర్ట్స్: ఆతిథ్య జట్టుకు అచ్చివచ్చిన స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ) మరో విజయానికి సిద్ధపడుతుండగా... కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) హ్యాట్రిక్ సాధించాలనే పట్టుదలతో విశాఖలోని వైఎస్సార్ స్టేడియంలో సోమవారం రాత్రి ప్రాక్టీస్ చేశాయి. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో పరాజయం పాలైన డీసీ వైఎస్సార్ స్టేడియంలో సీఎస్‌కే మ్యాచ్‌లో విజయం సాధించింది. బుధవారం ఆడే రెండో మ్యాచ్‌లోనూ విజయం సాధించేందుకు శ్రమిస్తోంది. మంగళవారం కూడా ఇరుజట్లు ప్రాక్టీస్ చేయనున్నాయి. ఇరుజట్ల మధ్య పోరు బుధవారం రాత్రి ఏడున్నర గంటలకు మ్యాచ్ జరగనుంది. శ్రేయాస్ అయ్యర్ సారధ్యంలో కేకేఆర్ జట్టు పోటీకి సిద్ధపడుతుండగా ఓపెనర్లుగా ఫిల్, నరేన్‌లుతో పాటు వెంకటేష్ అయ్యర్ సైతం విజయమే లక్ష్యంగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ప్రమాదం నుంచి కోలుకొని సీఎస్‌కే మ్యాచ్‌లో అర్ధసెంచరీతో రాణించడమే కాకుండా జట్టును విజయపథంలో నడిపిన రిషబ్ పంత్ తన ఫామ్‌ను కొనసాగించేందుకు శ్రమిస్తున్నాడు. ఇలా ఇరు జట్లు ఆత్మవిశ్వాసంతో మరోసారి విశాఖ క్రీడాభిమానులను అలరించేందుకు సిద్ధమవుతున్నాయి.

తిరుపతికి గుండె, ఊపిరితిత్తులు తరలింపు



బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తిని ఏలూరు జిల్లా నుంచి తీసుకువచ్చిన అంబులెన్స్ (ఇన్‌సెట్) అవయవాలను ఎయిర్‌పోర్టుకు తరలిస్తున్న పోలీసులు

అక్కిరెడ్డిపాలెం/గోపాలపట్నం : ఏలూరులో బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి అవయవాలను అతని బంధువులు దానం చేశారు. షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో సోమవారం రాత్రి అవయవ దానం ప్రక్రియ నిర్వహించారు. అతడి గుండె, ఊపిరితిత్తులను గ్రీన్ చానల్ ద్వారా కిమ్స్ ఆస్పత్రి నుంచి రాత్రి 10.15 గంటలకు పోలీసు జీపులో బయలుదేరి 10.19 గంటలకు విశాఖ విమానాశ్రయానికి తరలించారు. అప్పటికే సిద్ధంగా ఉన్న ప్రత్యేక విమానంలో తిరుపతిలోని శ్రీ పద్మావతి చిల్డ్రన్ హార్ట్ సెంటర్‌కు తరలించారు. అవయవాలతో పాటు ఇద్దరు వైద్యులు కూడా తిరుపతి వెళ్లారు. ఇదిలావుండగా కిమ్స్ ఆస్పత్రిలో అంబులెన్స్ మరమ్మతులకు గురవ్వడంతో పోలీసు కమిషనర్ రవిశంకర్ ఆదేశాలమేరకు పోలీసు వాహనంలోనే అవయవాలను ఎయిర్‌పోర్టుకు తరలించారు. మంగళవారం పార్థివ దేహాన్ని మృతుని బంధువులకు అప్పగించనున్నట్లు కిమ్స్ వైద్యులు తెలిపారు. గ్రీన్ చానల్ పర్యవేక్షణ గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది.

కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావుపై కేసు నమోదు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావుపై దువ్వాడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. 86వ వార్డు పరిధిలోని రాసాలమ్మకాలనీ, రాజీవ్‌నగర్‌లో ఎటువంటి అనుమతులు లేకుండా ఎలక్షన్ కోడ్‌ను ఉల్లంఘించి కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారని జోన్-6 జోనల్ కమిషనర్, ఎన్నికల నోడల్ అధికారి సన్యాసినాయుడు దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో లేళ్ల కోటేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చెన్నై సూపర్ కింగ్స్ తిరుగు పయనం


విశాఖ విమానాశ్రయంలోకి వెళ్తున్న చెన్నై సూపర్ కింగ్స్ జట్టు సభ్యులు

గోపాలపట్నం: వైఎస్సార్ స్టేడియంలో ఆదివారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో ఢిల్లీతో తలపడి ఓటమి పాలైన చెన్నై సూపర్ కింగ్స్ జట్టు సోమవారం తిరుగు ప్రయాణమైంది. సీనియర్ క్రికెటర్ ఎం.ఎస్.ధోనిని చూసేందుకు భారీ సంఖ్యలో అభిమానులు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. బస్సు దిగి ఎయిర్‌పోర్టులోకి వెళ్తున్న సమయంలో ధోని.. ధోని అంటూ కేరింతలు కొడుతూ అభిమానులు వీడ్కోలు పలికారు. జట్టు సభ్యులంతా ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు బయలు దేరారు.

'పది' మూల్యాంకనం ప్రారంభం


మూల్యాంకనంను పరిశీలిస్తున్న ఆర్జేడీ విజయ భాస్కర్

విశాఖ విద్య: పదో తరగతి మూల్యాంకనం ప్రక్రియ సోమవారం జ్ఞానాపురంలోని జూబ్లీ హైస్కూల్లో ప్రారంభమైంది. సబ్జెక్టుల వారీగా జవాబు పత్రాల పంపిణీ, మూల్యాంకనం చేపట్టే క్రమంలో 96 గ్రూపులను ఏర్పాటు చేశారు. 601 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 99 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 199 మంది స్పెషల్ అసిస్టెంట్లు మూల్యాంకనం విధుల్లో పాల్గొన్నారు. అసిస్టెంట్ ఎగ్జామినర్, చీఫ్ ఎగ్జామినర్లకు కేటాయించిన విభాగాల వారీగా జవాబు పత్రాలు అందజేశారు. తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు. మూల్యాంకనం ప్రక్రియలో ఎలా వ్యవహరించాలనే దానిపై డీఈవో ఎల్.చంద్రకళ ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. జిల్లాకు సుమారుగా 1,76,924 పేపర్లు మూల్యాంకనం కోసం వచ్చాయన్నారు. నిబంధనల మేరకు రోజూ 40 జవాబు పత్రాలను మూల్యాంకనం చేయాలన్నారు.

సమర్థవంతంగా నిర్వహించాలి : మూల్యాంకనం ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని విద్యా శాఖ ఆర్జేడీ బి.విజయభాస్కర్ సూచించారు. మూల్యాంకనం కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఎక్కడి తప్పిదాలకు ఆస్కారం లేకుండా విధుల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్షల విభాగం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఎస్.మురళీమోహన్, ప్రభుత్వ డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ యు.మాణిక్యం నాయుడు, సమగ్ర శిక్ష ఏపీసీ శ్రీనివాసరావు, డిప్యూటీ డీఈవో గౌరీ శంకర్ పాల్గొన్నారు.

ఆ మార్గంలో రైళ్ల వేగ పరిమితి పెంపు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల సౌకర్యార్థం వాల్తేర్ డివిజన్ పరిధి విశాఖపట్నం–పలాస మార్గంలో రైళ్ల వేగం పరిమితిని పెంచుతున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మార్గంలో ఇంత వరకు రైళ్ల గరిష్ట వేగం 110 కి.మి/గంటకు ఉండగా, దీనిని 130 కి.మి/గంటకు పెంచారు. ఈ మార్గంలో ప్రయాణించే ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో ప్రయాణించే రైళ్లు, వందే భారత్ రైళ్లు, అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఇకపై 130 కిమీ/గంటకు గరిష్ట వేగంతో ప్రయాణిస్తాయి. అప్, డౌన్, 3వ లైన్‌లలో ఈ వేగ పరిమితి పెంపు అమలు చేయనున్నారు. వెంటనే ఇది అమల్లోకి వస్తుందని త్రిపాఠి పేర్కొన్నారు. ఈ వేగ పరిమితి పెంపు గోపాలపట్నం–దువ్వాడ మధ్య మాత్రం వర్తించదన్నారు.

ఆరిలోవలో తుపాకీ కలకలం

ఆరిలోవ: అల్లరి మూకలు ఆరిలోవలో హద్దులు దాటుతున్నాయి. ఆదివారం సాయంత్రం కొందరు యువకులు గన్‌తో హల్‌చల్ చేస్తూ టాస్క్‌ఫోర్సు పోలీసులకు చిక్కారు. అయితే ఈ విషయాన్ని దర్యాప్తు పేరుతో పోలీసులు గోప్యంగా ఉంచారు. ఇటీవల సాయి అనే రౌడీషీటర్ మృతి చెందాడు. అతని వద్ద ఓ లైసెన్స్‌డ్ 9 ఎంఎం గన్ ఉండేది. సాయి మృతి చెందే ముందు ఆ గన్‌ను అతని గ్యాంగ్‌లో కిట్టు అనే యువకుడికి ఇచ్చినట్లు తెలిసింది. ఆ యువకుడు తన అనుచరులతో కలిసి ఆ గన్‌తో ఆదివారం హల్‌చల్ చేస్తుండగా చినగదిలి ప్రాంతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు పట్టుకున్నారు. ఆ యువకుడితో పాటు మరొకరిని అదుపులోకి తీసుకొని ఆరిలోవ పోలీసులకు అప్పగించారు. గన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సాయికి లైసెన్స్‌డ్ గన్ ఎలా వచ్చింది, అతను ఈ యువకుడికి ఎందుకు ఇచ్చాడు, ఈ గన్‌తో ఎంత మందికి సంబంధం ఉంది, తదితర వాటి గురించి పోలీసులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. పూర్తి దర్యాప్తు అనంతరం వివరాలు వెల్లడిస్తామని పోలీసులు చెబుతున్నారు.

పోర్టు ట్రాఫిక్ మేనేజర్ రత్నశేఖర్‌కు ఘన సత్కారం


పోరు ట్రాఫిక్ మేనేజర్ రత్నశేఖర్‌ను సన్మానిస్తున్న పోర్టు చైర్మన్ అంగముత్తు

విశాఖ సిటీ: సరుకు రవాణాలో విశాఖ పోర్టు సరికొత్త రికార్డు నెలకొల్పడంలో కీలక పాత్ర పోషించిన ట్రాఫిక్ మేనేజర్ బి.రత్నశేఖర్‌రావు గుజరాత్‌లోని కాండ్లా పోర్టుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పోర్టు పరిపాలన భవనంలోని బోర్డు రూంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయనను పోర్టు చైర్మన్ అంగముత్తు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోర్టు చరిత్రలోనే అత్యధిక సరుకు రవాణా చేయడంలో ట్రాఫిక్ మేనేజర్ బి.రత్నశేఖరరావు పాత్ర ఎంతో ఉందని ప్రశంసించారు. ఆయన కృషి, నిరంతర శ్రమతో పోర్టు అనేక రికార్డులు సొంతం చేసుకుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పోర్టు చీఫ్ విజిలెన్స్ అధికారి పి.ఎస్.ఎల్.స్వామి, ఇతర విభాగాధిపతులు పాల్గొన్నారు.

సత్వరమే ఫిర్యాదుల పరిష్కారం

దొండపర్తి: డయల్ యువర్ సీపీ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే చట్టపరంగా పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం సీపీ తన ఛాంబర్ నుంచి ఉదయం 11 నుంచి 12 గంటల వరకు నిర్వహించిన డయల్ యువర్ సీపీ కార్యక్రమానికి అయిదుగురు కాలర్స్ ఫోన్ చేసి ఫిర్యాదులు చేశారు. వెంటనే ఆ ఫిర్యాదులపై చర్యలు తీసుకొని పరిష్కరించాలని చెప్పారు. అనంతరం మధ్యాహ్నం 12 నుంచి 12.30 వరకు వృద్ధుల కోసం నిర్వహించిన కార్యక్రమంలో ఎంవీపీ కాలనీ చెందిన ఒక వృద్ధుడు ఫోన్ చేశారు. ఒక బిల్డర్ వద్ద ఇల్లు కొనుగోలు చేసి మొత్తం చెల్లించిన ప్పటికీ.. ఇంకా డబ్బులు ఇవ్వాలంటూ ఇబ్బందులు పెడుతున్నాడని ఫిర్యాదు చేశారు. గత నెల 15వ తేదీన నిర్వహించిన డయల్ యువర్ సీపీ కార్యక్రమంలో 15 ఫిర్యాదులు రాగా.. 12 ఫిర్యాదులను పరిష్కరించారు. మిగిలిన మూడు కూడా పరిష్కార దశలో ఉన్నట్లు తెలిపారు.

చిట్టీల పేరుతో మోసం కేసులో మహిళకు మూడేళ్ల జైలు

విశాఖ లీగల్: చిట్టీల పేరుతో పలువుర్ని మోసగించిన మహిళకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.15 వేలు జరిమానా విధిస్తూ నగరంలోని నాలుగవ అదనపు ప్రధాన మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ టి.వెంకట రాజేష్ కుమార్ సోమవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించిన పక్షంలో అదనంగా రెండు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో పేర్కొన్నారు. సీనియర్ అదనపు పబ్లిక్ ప్రాసెక్యూటర్ మైలపల్లి ఆదినారాయణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితురాలు మన్యాల వరలక్ష్మి త్రీ టౌన్ పరిధిలోని మద్దిలపాలెం సమీపంలోని గొల్లలపాలెం ప్రాంతంలో నివాసముంటున్నారు. మూడేళ్ల క్రితం ఆమె 11 నెలల చిట్టీల పేరుతో రూ.18 లక్షలు వసూలు చేసింది. ఇందులో సభ్యులందరూ నగరంలోని ఒక ఆస్పత్రికి చెందిన సిబ్బంది. గడువు ముగిసినా డబ్బులు ఇవ్వకపోవడంతో బాధితులు త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితురాలిపై భారతీయ శిక్షాస్మృతి 420, చిట్ ఫండ్ యాక్ట్‌లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో మోసగించినందుకు రెండేళ్లు, చట్ట విరుద్ధమైన చిట్టీలు నిర్వహించినందుకు ఏడాది జైలు విధించారు. రెండు శిక్షలు ఏకకాలంలో అమలు జరగాలని న్యాయమూర్తి తమ తీర్పులో పేర్కొన్నారు.

విద్యార్థి మృతికి కారకులను తక్షణమే అరెస్టు చేయాలి

కళాశాల వద్ద విద్యార్థి సంఘాల ఆందోళన


పీఎంపాలెం సీఐతో వాగ్వాదానికి దిగుతున్న విద్యార్థి సంఘం నాయకులు

మధురవాడ: కొమ్మాది చైతన్య కళాశాలలో ఫ్యాకల్టీ లైంగిక వేధింపులు కారణంగా ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థిని మృతికి కారకులైన వారిని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని సోమవారం ప్రజా సంఘాలు, విద్యార్థిని తల్లిదండ్రులు, బంధువులు ఆందోళన చేశారు. జన జాగరణ సమితితో పాటు ఏబీవీపీ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌వో విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు కళాశాల వద్దకు చేరుకుని ప్రధాన గేటు వద్ద బైఠాయించారు. గత గురువారం రాత్రి విద్యార్థిని మృతి చెందినా నేటి వరకు నిందితులను అరెస్టు చేయకపోవడం ఏంటని వారు ప్రశ్నించారు. విచారణ కమిటీ నిజాలను నిగ్గుతేల్చి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులను వారించేందుకు పోలీసులు ప్రయత్నించగా వారితో వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసులు ఆందోళనకారులను బలవంతంగా అరెస్టు చేశారు. విద్యార్థి నాయకులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఏబీవీపీ జిల్లా కన్వీనర్ యు.నితిన్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ రాయుడు పేర్కొన్నారు. ఇదిలావుండగా రూపశ్రీ మృతిపై తమకు అనుమానం ఉందని మృతురాలి సోదరుడు రాజు, తండ్రి రమణలు పేర్కొన్నారు. బాలిక మృతి కేసులో దర్యాప్తు వేగవంతం చేశామని సీఐ రామకృష్ణ చెప్పారు. బాధ్యులపై 24 గంటల్లో చర్యలు తీసుకుంటామన్నారు.

పిల్లల్ని తల్లిదండ్రులు బాధ్యతగా పెంచాలి



మాట్లాడుతున్న శశి విద్యాసంస్థల వైస్ చైర్మన్ నరేంద్రకృష్ణ

తగరపువలస: పిల్లల్ని తల్లిదండ్రులు బాధ్యతగా పెంచాలని అలాగే వారి భవిష్యత్తును విద్యాసంస్థలు తీర్చిదిద్దాలని సంగివలస శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. సంగివలస క్యాంపస్‌లో 5 నుంచి 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు ఐఐటీ, నీట్‌లపై అవగాహన సదస్సు నిర్వహించారు. 5 వేల మంది విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరైన ఈ సదస్సులో ఆయన మాట్లాడారు. 44 ఏళ్లుగా విద్యారంగంలో ఉన్న అనుభవంతో తాము 2018 నుంచి సంగివలస క్యాంప్ ద్వారా విజయాలు సాధిస్తున్నామన్నారు. విద్యాప్రణాళికలు, అంతకిభావంతో కూడిన అధ్యాపకులతో అసాధరణ ఫలితాలు సాధిస్తున్నామన్నారు. వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ మాట్లాడుతూ తల్లిదండ్రులకు తమ చిన్నారుల అభిరుచులపై అవగాహన ఉండాలన్నారు. వారు ఏ రంగంలో ఆసక్తి ఉందో గమనించి ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులను మార్కుల కోసం కాకుండా జ్ఞానం కోసం విద్యాసంస్థలకు పంపాలన్నారు. సదస్సులో కరస్పాండెంట్ మేకా క్రాంతిసుధ, డైరెక్టర్ బూరుగుపల్లి రాధారాణి, విద్యార్థుల తల్లులు భాగ్యలక్ష్మి, లక్ష్మి, క్యాంపస్ ఇంచార్జ్ వి.శ్రీనివాసరెడ్డి విద్యాసంస్థల ప్రగతిని వివరించారు.

తిరుమలలో జేఈఈ అడ్వాన్స్‌డ్ సదస్సుకు స్పందన


మాట్లాడుతున్న తిరుమల విద్యాసంస్థల చైర్మన్ తిరుమలరావు

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస తిరుమల విద్యాసంస్థల ఆవరణలో జేఈఈ అడ్వాన్స్‌డ్ మెయిన్స్, నీట్ తదితర జాతీయ పరీక్షలకు సంబంధించి జరిగిన అవగాహన సదస్సుకు అనూహ్య స్పందన లభించినట్టు చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. పది వేల మందికి పైగా విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్యార్థులు సోషల్‌మీడియాకు బానిసలుగా మారారన్నారు. మొబైల్ ఫోన్ విషయంలో తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల కఠినంగా ఉండాలన్నారు. పుస్తకాల కంటే ఫోన్లతో గడిపితే జరిగే నష్టాన్ని వివరించాలన్నారు. సదస్సులో రెసిడెంట్ డైరెక్టర్లు కేఎస్‌వీవీ సత్యనారాయణ, ఎం.సత్యనారాయణ, ఇ.మృత్యుంజయరావు, ఫిజిక్స్ అధ్యాపకురాలు రజనీవర్మ, తల్లిదండ్రుల కమిటీ తరపున శ్రీనివాసరావు మాట్లాడారు.